నమస్తే తెలంగాణ
బుధవారం 8 మార్చి 2017

# మహిళలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తాం

## కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ



సమావేశంలో మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ

**బంజారాహిల్స్, మార్చి 7 (నమస్తే తెలంగాణ):** మహిళలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలను కల్పించడంతోపాటు ఒకే రకమైన పనికి ఒకే రకమైన వేతనాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినాన్ని పురస్కరించుకుని కేంద్ర కార్మిక ఉపాధికల్పన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణాలో 'ఎంప్లాయ్ ఉమెన్-ఎన్‌రిచ్ ఇండియా' అన్న అంశంపై ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయ కార్మిక చట్టాలకు అనుగుణంగా దేశంలోని కార్మికులకు వేతనాలను అమలు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. గతంలో సరైన నైపుణ్యతలు లేవన్న కారణంగా కార్మికులకు సరైన వేతనాలను అందించకపోవడం జరిగేదని, దీన్నిదృష్టిలో పెట్టుకుని స్కిల్ ఇండియా కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను అందిస్తున్నామని, దీనివల్ల పరిశ్రమకు అవసరమయ్యే నైపుణ్యతలను పెంపొందించడంతోపాటు స్వయంగా ఉపాధి పొందే అవకాశం ఏర్పడుతోందన్నారు. దీంతోపాటు మేకిన్ ఇండియా కార్యక్రమం కింద లక్షలాదిగా  ఉద్యోగాలను కల్పించేందుకు ప్రణాళికలు అమలు పరుస్తున్నామన్నారు. గతంతో పోలిస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలకు అన్నిరంగాల్లో అవకాశాలను కల్పించేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టిందన్నారు.  సమావేశంలో సామాజిక ఉద్యమకారిణి శాంతా సిన్హా మాట్లాడుతూ..ప్రభుత్వాలు బాలికా విద్యపై దృష్టిసారించాలని సూచించారు. విద్యాలక్ష్మి పథకం ప్రవేశపెట్టి రూ.50వేలను స్కాలర్‌షిప్‌ల రూపంలో అందజేస్తే నాణ్యమైన విద్యను అందుకునే అవకాశం దక్కుతుందన్నారు. కుటుంబ బాధ్యతలన్నీ పూర్తిచేసుకున్న తర్వాతే తమకు ఇష్టమైన పనిని ఎంచుకునే అవకాశం మహిళలకు దక్కుతోందని ఎలీప్ సంస్థ అధ్యక్షురాలు రమాదేవి అన్నారు. మాన్యుఫాక్చరింగ్ రంగానికి రాయితీలను ప్రోత్సాహకాలను అందించగలిగితేనే ఈ రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు ఉపాధి దొరుకుందని పేర్కొన్నారు. పరిశోధనారంగంలో మహిళలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారని డీఆర్‌డీఏలో 375మంది పురుష శాస్త్రవేత్తలు ఉంటే కేవలం 10మంది మాత్రమే మహిళాశాస్త్రవేత్తలు ఉన్నారంటే పరిస్థితిని గుర్తించవచ్చని ప్రముఖ శాస్త్రవేత్త శశికళా సిన్హా పేర్కొన్నారు. నాబార్డ్ మాజీ సీజీఎం వైఆర్‌కే.రావు,రాష్ట్ర వైద్య విభాగం డైరెక్టర్ రమణి,నర్తకి ఆనందా శంకర్‌జయంత్,డాక్టర్ మంజులా అనగాని,మహిళా పారిశ్రామికవేత్త వనితాదాట్ల పాల్గొన్నారు. ఫ్యూచరిస్టిక్ సిటీస్ సంస్థ డైరెక్టర్ కరుణాగోపాల్ కార్యక్రమానికి అనుసంధానకర్తగా వ్యవహరించారు.